

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
మహానంది: మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు.



టీడీపీ నేతల పాగా
పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను టీడీపీ నేతలు దర్జాగా కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. నంద్యాల శివారులోని వైఎస్సార్ నగర్‌లో కబ్జా పర్వం సాగింది. 8లో▸



భార్యను నరికేసిన భర్త
అనుమానంతో భార్యను అతి కిరాతకంగా నరికిన ఘటన అవుకులో చోటు చేసుకుంది. అడ్డొచ్చిన భార్య పిన్నిపైనా కత్తితో దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. 8లో▸

న్యూస్‌రీల్

కరువు రైతుకు తీపి కబురు

- రేపు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- ఉమ్మడి జిల్లాకు దాదాపు రూ.460 కోట్ల ప్రయోజనం

కర్నూలు(అగ్రికల్చర్): కరువు రైతుకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2023–24లో మొదటిసారి అనావృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాభావం వల్ల ఖరీఫ్ పంటలు దెబ్బతినడంతో కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన 24 మండలాలను, నంద్యాల జిల్లాలో ఆరు మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసింది. కరువు రైతులకు ఈ నెల 6న ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం బటన్‌నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు దాదాపు రూ.460 కోట్ల మేర ప్రయోజనం లభిస్తోంది.

మద్దతు ధరతో రబీ ఉత్పత్తుల కొనుగోలు

- నేటి నుంచి రిజిస్ట్రేషన్‌లకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 రబీ సీజన్‌లో పండించిన మినుములు, వేరుశనగ, శనగలను మార్క్‌ఫెడ్ రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తోంది. ఆయా పంటలు సాగు చేసినట్లుగా ఈ–క్రాప్‌లో నమోదై.. ఈ–కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి ఈ పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. శనగలకు రూ.5,440, మినుములకు రూ.6,950, వేరుశనగకు రూ.6,377 ప్రకారం మద్దతు ధరలు ఉన్నాయని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గద్వాల రాజు తెలిపారు. నాఫెడ్ ఆధ్వర్యంలో మద్దతు కొనుగోళ్లు చేపట్టామన్నారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు మద్దతు ధరతో అమ్ముకోవడానికి సంబంధిత ఆర్‌బీకేల్లో మంగళవారం నుంచి రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఆయా పంటలను నిర్ణయించిన నాణ్యత ప్రమాణాల మేరకు కొనుగోలు చేస్తామన్నారు.

7న మంత్రాలయంలో ఉద్యోగ మేళా

కర్నూలు సిటీ: మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర డిగ్రీ కాలేజీలో ఈ నెల 7వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమా, ఎంబీఏ, బీటెక్ చదివి 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.10 వేల నుంచి 28 వేల వరకు వేతనాలు ఉంటాయని, ఆసక్తి ఉన్న వారు www.apssdc.in అనే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9642735717, 7799494856, 8309283980 నంబర్లను సంప్రదించాలన్నారు.

30లోగా డిగ్రీ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష ఫీజును ఈనెల 6 నుంచి 30వ తేదీలోగా చెల్లించాలని వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ సుందరనాంద పుచ్చ తెలిపారు. 2008 నుంచి 2014వ సంవత్సరం మధ్యలో డిగ్రీ చదివి వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి వన్ టైం ఛాన్స్ కింద పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 4వ తేదీ వరకు రూ.100, 8వ తేదీ వరకు రూ.200, 13వ తేదీ వరకు రూ.1000 ఫైన్ ఫీజుతో పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక్క సబ్జెక్ట్‌కు రూ.1500, రెండు సబ్జెక్ట్స్‌కు రూ. 2000, మూడు సబ్జెక్ట్స్‌కు రూ.3000 పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాలకు http://rsuadmission.com// వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు కూడా పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పింఛన్ల పంపిణీ మంగళవారం కూడా కొనసాగనుంది. వృద్ధాప్య, వికలాంగ, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్ల పైబడిన వారు, వేలిముద్రలు, ఐరీస్ నమోదు కాని వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందవచ్చు. ఇతర కేటగిరిలకు చెందిన వారు విధిగా మూడు సార్లు వేలిముద్రలు, ఐరీష్ నమోదుకు ప్రయత్నం చేయాల్సి ఉంది. మూడు సార్లు ఫెయిల్ అయితే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్లు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 97.64 శాతం, నంద్యాల జిల్లాలో 98.05 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది.

ప్ర'జల' కష్టాలు తీర్చేలా..

- చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్‌ఎస్ ట్యాంకుల్లో నీటి నిల్వలు
- తుంగభద్ర దిగువ కాలువకు ప్రతి రోజూ 480 క్యూసెక్కుల నీరు
- వంద గ్రామాల గొంతులు తడిపేలా కార్యాచరణ
- ప్రకృతి సహకరించకున్నా పటిష్ట ప్రణాళిక అమలు
- వేసవిలో తొలగనున్న నీటి ఎద్దడి



దిగువ కాలువ నీటితో హొళగుంద ఎస్‌ఎస్ ట్యాంకును నింపుతున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): వరుణ దేవుడు కరుణించక వర్షాలు ఆశించినంతంగా కురవకపోవడంతో వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడనుందని అందరూ ఆందోళనకు గురయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో వేసవి గట్టెక్కే సూచనలు కనిపిస్తున్నాయి. అవసరాల మేరకు తుంగభద్ర దిగువ కాలువ (ఎల్‌ఎల్‌సీ) నీటితో ఆయా ప్రాంతాల పరిధిలోని సమ్మర్ స్టోరేజ్ (ఎస్‌ఎస్) ట్యాంకులను అధికారులు నింపారు. దీంతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని దాదాపు వందకు పైగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీర్చిన ట్లవుతోంది. ప్రస్తుత వేసవిలో తీవ్ర తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందనే అంచనా మేరకు గత ఏడాది నవంబర్ నెలలో తుంగభద్ర దిగువ కాలువకు నీరు బంద్ అయ్యే సమయంలో అక్టోబర్ 15 నుంచి ఎల్‌ఎల్‌సీ నీటితో ఆయా ప్రాంతాల్లోని ఎస్‌ఎస్ ట్యాంకులను నింపారు. అప్పట్లో తీసుకున్న చర్యలతో ఇప్పటి వరకు పలు ఎస్‌ఎస్ ట్యాంకుల్లో ఒక మోస్తరుగా నీటి నిల్వలు ఉన్నాయి. తిరిగి సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితులు కనిపించడంతో జిల్లా కలెక్టర్ ద్వారా మరోసారి ఎల్‌ఎల్‌సీ నీటిని విడుదల చేయించాలని ఇరిగేషన్ అధికారులను ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు కోరారు. ప్రధానంగా ఆస్పరి, ఆదోని, హాలహర్వి, హొళగుంద, ఆలూరు, చిప్పగిరి, పెద్దకడుబూరు మండలాల్లోని జనవాసాలన్నీ దాదాపు సీడీడబ్ల్యూఎస్ స్కీంలపై ఆధారపడి ఉన్నందున ఎల్‌ఎల్‌సీ నీటిని విడుదల చేయాలని కోరారు.

వేసవి ప్రణాళికకు రూ.14.90 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా ప్రస్తుత వేసవిలో వివిధ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందే గుర్తించారు. 2024–25 సంవత్సరంలో జిల్లాలోని 21 మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా, 2 మండలాలను మధ్యంతర కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఆయా మండలాల్లోని 169 గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలను అధిగమించేందుకు అవసరమైన పనులు చేపట్టేందుకు రూ.14.98 కోట్లు అవసరమవుతాయని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆయా ప్రాంతాల్లోని 595 చేతి పంపుల్లో డీపెనింగ్, ఫ్లషింగ్ పనులు చేపట్టేందుకు రూ.5.09 కోట్లు, 169 గ్రామాల్లో నీటిని ట్రాన్స్‌పోర్టు చేసేందుకు రూ.9.88 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించి పంపించారు.


ట్రాక్టర్ ఇంజన్‌తో ఎల్‌ఎల్‌సీ నీటిని అల్వాల ఎస్‌ఎస్ ట్యాంకుకు మళ్లిస్తున్న దృశ్యం

టీడీపీ హయాంలో ఇలా..

టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తేది. వరుసగా ఐదేళ్ల కరువు పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు సైతం ఆశించినంతంగా ఉండేవి కాదు. తుంగభద్ర దిగువ కాలువకు అరకొర నీరు వచ్చేది. పంటలు సరిగ్గా పండేవి కాదు. ప్ర'జల' కష్టాలను అప్పటి ప్రభుత్వం పట్టించుకునేది కాదు. దీంతో వందల గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నెలకొనేది. చలమల వద్ద బిందెడు నీటి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఊర్లకు దూరంగా ఉండే వ్యవసాయ బావుల వద్దకు, బోర్ల వద్దకు పదుల కిలోమీటర్లు ప్రయాణించి నీటికి తెచ్చుకోవాల్సి దుస్థితి ఉండేది. అప్పుడప్పుడు వచ్చే ట్యాంకర్ల వద్ద నీటి కోసం కుస్తీ పట్టే దృశ్యాలు కనిపించేవి. పేదలు పనులు మానుకుని తాగునీటి కోసమే రోజంతా కష్టపడాల్సి వచ్చేది.

రోజుకు 480 క్యూసెక్కుల నీరు విడుదల...

తుంగభద్ర దిగువ కాలువ కింద మనకు 1.49 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. జిల్లాలోని పశ్చిమ ప్రాంత గ్రామాలకు తాగునీటిని అందించేందుకు వీలుగా ప్రతి రోజు ఎల్‌ఎల్‌సీ నుంచి 480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువల ద్వారా వస్తున్న ఈ నీటిని ఆయా ప్రాంతాల్లోని ఎస్‌ఎస్ ట్యాంకులకు మళ్లిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఎస్‌ఎస్ ట్యాంకులు ఎత్తులో ఉన్నందున ట్రాక్టరు, ఆయిల్ ఇంజిన్ల సహాయంతో కాలువల నుంచి నీటిని ఎస్‌ఎస్ ట్యాంకుల్లోకి నింపుతున్నారు. గత నెల 19 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు ఎల్‌ఎల్‌సీ నుంచి జిల్లా తాగునీటి అవసరాలకు 0.93 టీఎంసీల నీటిని తీసుకున్నారు. దీంతో ఎస్‌ఎస్ ట్యాంకుల్లో ప్రస్తుతం నీటి నిల్వలు 50 శాతానికి పైగా చేరుకున్నాయి. అలాగే ఆదోని, ఎమ్మిగనూరు మన్సిపాలిటీలకు నీటిని తీసుకుంటూనే, రోజుకు 220 క్యూసెక్కుల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టుకు వదలుతున్నట్లు ఇరిగేషన్ ఇంజినీర్లు చెబుతున్నారు. ప్రస్తుతం జీడీపీలో 0.90 టీఎంసీల నీరు ఉంది. ఈ నీటిని కర్నూలు, డోన్, పత్తికొండ, కృష్ణగిరి, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల తాగునీటికి వినియోగించనున్నారు. జీడీపీ నుంచి రోజుకు 55 క్యూసెక్కుల నీటిని కర్నూలు నగర తాగునీటి అవసరాలకు వదులుతున్నారు. తుంగభద్ర దిగువ కాలువకు ఈనెల 10వ తేదీ వరకు నీరు విడుదల కానుంది. ఈ నీటితో ఎస్‌ఎస్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది.

“ తాగునీటికి ఇబ్బంది ఉండదు



ఇప్పటికే రెండు సార్లు తుంగభద్ర దిగువ కాలువ నీటితో హొళగుంద ఎస్‌ఎస్ ట్యాంకు నింపారు. ఈ ఏడాది వేసవిలో తాగునీటికి పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చు. వర్షాలు కురవక పోవడం వల్ల నీటి సమస్య చాలా అధికంగా ఉంటుందని భయపడ్డాం. అయితే అధికారులు సకాలంలో తీసుకున్న చర్యలతో నీటి సమస్య కనిపించడం లేదు. దాదాపు బోర్లలో నీరు అడుగంటి పోయింది. ఈ పరిస్థితుల్లో కాలువ నీటిని ఎస్‌ఎస్ ట్యాంకుకు మళ్లించడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంది.

– వన్నూర్‌సాబ్, హొళగుంద

ప్రత్యేక చర్యలు తీసుకున్నాం



ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నాం. ముఖ్యంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంత పల్లెల్లో నీటి సమస్యను తీర్చేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇరిగేషన్ అధికారులు కూడా పూర్తిగా సహకారం అందించడంతో ఎల్‌ఎల్‌సీ నీటితో ఇప్పటికే రెండు సార్లు ఎస్‌ఎస్ ట్యాంకులను నింపుకున్నాం. ప్రస్తుతం అన్ని ట్యాంకుల్లో 50 శాతానికి పైగా నీటి నిల్వలు ఉన్నాయి. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపడతాం.

– బీ నాగేశ్వరరావు, ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మయూర వాహనంపై మల్లన్న వైభవం


మయూర వాహనంపై ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఆది దంపతులు


శివుని వేషధారణలో కళాకారుడి ప్రదర్శన


ఇరుముడితో దర్శనానికి వెళ్తున్న శివస్వాములు

- శ్రీగిరిలో ఆధ్యాత్మికంగా సాగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పరవశించిన భక్తులు
- టీటీడీ తరఫున మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ
- నేడు రావణవాహన సేవలో దర్శనమివ్వనున్న స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు సోమవారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయాల ప్రాంగణంలోని అలంకార మండపంలో మయూర వాహనాన్ని సుగంధ పుష్పాలతో ముస్తాబు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను తోడ్కొనివచ్చి మయూర వాహనంపై ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేదపండితులు అర్చనలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. మయూరవాహన సేవ పూజా కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ఈఓ డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలోని పరివార దేవతామూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం, గంగాధర మండపం మీదుగా నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం దాకా సాగింది. మయూర వాహనంపై దర్శనమిచ్చిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


పాతాళగంగ వద్ద భక్తుల రద్దీ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

శ్రీశైలంలో నేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు రావణవాహన సేవ నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు.

స్వామిఅమ్మవార్లకు టీటీడీ పట్టువస్త్రాలు

తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున స్వామిఅమ్మవార్లకు సాయంత్రం పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి పట్టువస్త్రాలు తీసుకు రాగా శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవోడి.పెద్దిరాజు, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ రాజగోపురం వద్ద ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. తదుపరి స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈఓ మాట్లాడుతూ శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ఆనవాయితీగా పట్టువస్త్రాలు సమర్పించడం జరుగుతందన్నారు. శ్రీశైల దేవస్థాన అభివృద్ధికి టీటీడీ తగిన సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. టీటీడీ తరుపున శ్రీశైలంలో 200 గదులు నిర్మించేందుకు త్వరలో బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్య అందుతోందని, ఇందుకు 25 శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందని, మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ కె.శామ్యూల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రైవేటు స్కూళ్లలో 1వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల ఆధార్ కార్డు ద్వారా ప్రాథమిక వివరాలతో https://cse.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయం/ మండల విద్యా వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ సెంటర్/ఎంఈఓ ఆఫీస్), సంబంధిత పాఠశాల నుంచే దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులకు లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

మహిళా ఉద్యోగులకు ఆప్షనల్ సెలవు

కర్నూలు (అగ్రికల్చర్): ఈనెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులకు ఈనెల 6, 7 తేదీల్లో ఆప్షనల్ సెలవు ఇస్తూ జిల్లా కలెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులకు వివిధ ఆటల పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఆటల పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా మహిళా ఉద్యోగులకు ఈ సెలవులు ఇచ్చినట్లు జిల్లా మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సరస్వతి తెలిపారు. ఆటల పోటీల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులు 7702006652 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు. 8వ తేదీన నిర్వహించే మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు మహిళా ఉద్యోగులందరికీ సాధారణ సెలవు దినాన్ని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

- సాధారణ చార్జీలే వసూలు

కర్నూలు సిటీ: మహాశివరాత్రి పండుగ సందర్భంగా ప్రజా రవాణా సంస్థ అధికారులు శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసి గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా 52 సర్వీసులను తిప్పేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి నడక మార్గంలో భక్తులు శ్రీశైలం వెళ్తున్నారు. పాదయాత్ర భక్తులను దృష్టిలో ఉంచుకుని కర్నూలు నుంచి వెంకటాపురం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. వీటిలో సాధారణ చార్జీ రూ.150 వసూలు చేస్తున్నారు. జిల్లాలోని ఐదు డిపోల నుంచి శైవక్షేత్రాలకు 310 ప్రత్యేక బస్సులు నడపనుండగా.. ఇందులో అత్యధికంగా శ్రీశైలానికి 295 బస్సులు ఉన్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు వీటిని తిప్పనున్నారు. జిల్లాకు చెందినవి 110, ఇతర జిల్లాల నుంచి మరో 185 బస్సులు తెప్పిస్తున్నారు. జిల్లాలోని ఇతర శైవక్షేత్రాలకు మరో 15 బస్సులు నడపనున్నారు. కర్నూలు–జగన్నాథగట్టుకు 3, ఎమ్మిగనూరు–గురజాలకు 12 చొప్పున నడపనున్నారు.

చార్జీల వివరాలు..

కర్నూలు నుంచి శ్రీశైలానికి రూ.350, ఆదోని–శ్రీశైలం రూ.500, ఎమ్మిగనూరు–శ్రీశైలం రూ.450, కోడుమూరు – శ్రీశైలం రూ.400, నందికొట్కూరు– శ్రీశైలం రూ.300, ఆత్మకూరు–శ్రీశైలం రూ.250, మహానంది–శ్రీశైలం రూ.350 చొప్పున సాధారణ చార్జీ వసూలు చేయనున్నారు. డీజిల్ ధరలు పెరిగినప్పటికీ మూడేళ్లుగా భక్తులపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వ సూచనల మేరకు ప్రజా రవాణా సంస్థ సర్వీసులను సాధారణ టికెట్ ధరలకే నడుపుతున్నారు.


కర్నూలు నుంచి శ్రీశైలం వెళ్తున్న బస్సు వద్ద ప్రయాణికులు

ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం

మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలంతో పాటు ఇతర శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే డిపో మేనేజర్లతో సమావేశాలు నిర్వహించి సూచనలు జారీ చేశాం. ఘాట్ రూట్లలో తిరిగే బస్సు ఫిట్‌నెట్, కండీషన్స్ ఉండేవిధంగా ఆదేశాలు ఇచ్చాం. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నాం.

– టి. శ్రీనివాసులు, జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి

క్లుప్తంగా

నావికా దళంలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత నావికా దళంలో షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్కూరు సీఈవో పీవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత నావికా దళంలో 254 షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని, ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్, టెక్నికల్ బ్రాంచ్ పోస్టులకు 60 శాతం మార్కులతో బీటెక్ లేదా బీఈలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎడ్యుకేషన్ బ్రాంచ్ పోస్టులకు 60 శాతం మార్కులతో మెకానికల్/ఎలక్ట్రికల్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ స్పెషలైజేషన్‌తో బీటెక్ ఉత్తీర్ణత లేదా 60 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఆపరేషనల్ రీసెర్చ్ స్పెషలైజేషన్‌తో ఎంఎస్సీ ఉత్తర్ణత కలిగి ఉండాలన్నారు. లాజిస్టిక్ విభాగంలోని పోస్టులకు ఎంబీఏ/ఎంసీఏ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 24 సంవత్సరాల 6 నెలల లోపు ఉండాలని, ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్‌లోని పైలెట్ పోస్టులకు 18 సంవత్సరాల నుంచి 24 సంవత్సరాల 6 నెలలోపు ఉండి కమర్షియల్ పైలెట్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కనీస ఎత్తు పురుషులైతే 157 సెంటిమీటర్లు, మహిళలకు 152 సెంటిమీటర్లు, ఎత్తుకు తగ్గ బరువు ఉండాలన్నారు. సంబంధిత విద్యార్హత మెరిట్, నిర్దేశిత శారీరక ఆరోగ్య ప్రామాణిక అర్హతల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాల కోసం https:// www. joinindiannavy. gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పక్కాగా లెక్క కట్టండి

● జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చు వివరాలను పక్కాగా లెక్క కట్టి రికార్డుల్లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ బృంద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఎంసీసీటీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎఫ్ఎస్‌టీ టీంలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ నిబంధలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. పార్లమెంటరీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.95 లక్షలకు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలకు సీలింగ్ చేయబడిందని, ఈ మేరకు భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకలను తప్పక పాటించి విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక ఆయా టీంల అధికారులు అన్ని విధాలా సన్నద్ధమై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలన్నారు. ఓటర్లను మభ్య పెట్టే ఎలాంటి చర్యలనైనా ఎంసీసీ నిబంధనల ఉల్లంఘన కింద పరిగణించాల్సి ఉంటుందన్నారు. డబ్బులు పంచినా, తీసుకున్నా నేరం కింద కేసు చేయవచ్చన్నారు. అలాగే లిక్కర్ పంపిణీ, ఇతర కానుకల పంపిణీ జరగకుండా చూసే బాధ్యత ఎంసీసీ నోడల్ అధికారులదైనప్పటికీ అందుకు సంబంధించిన సామగ్రి రవాణాను అడ్డుకొని సీజ్ చేయడంలో ఈఎస్ఎంఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు నిర్వర్తించే అధికారులు బాధ్యతగా చర్యలు చేపట్టాలన్నారు.

పేదల స్థలాల్లో టీడీపీ నేతల పాగా





భూమా సేవాదళం పేరుతో పేదల స్థలంలో నిర్మించిన భవనం



టీడీపీ నేతలు ఆక్రమించిన పూజారికి చెందిన 40 సెంట్ల స్థలం

● సేవా ముసుగులో పేదల స్థలాలు కబ్జా
● భవనం నిర్మించి అద్దెకిస్తున్న వైనం
● బాధితులను బెదిరిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మలసత్రం: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు వైఎస్సార్ హయాంలో పంపిణీ చేసిన స్థలాలను టీడీపీ నేతలు దర్జాగా కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. నంద్యాల శివారులోని వైఎస్సార్ నగర్‌లో దాదాపుగా 6,500 పట్టాలు ఇవ్వగా కొందరు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. కొందరు పేదలు వివిధ కారణాలతో అక్కడ ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగా వదిలేశారు. గత టీడీపీ పాలనలో ఆ పార్టీ నేతలు ఆ ఖాళీ స్థలాలను ఆక్రమించేశారు. 2018 సంవత్సరంలో అధికారం చేతిలో ఉందని వెయ్యికి పైగా పట్టాలను గుర్తించి కొత్త పట్టాలు పుట్టించి, ఆ పార్టీ మద్దతుదారులకు ఇప్పించారు. సందట్లో సడేమియా అంటూ కొందరు నేతలు దాదాపుగా 500 ప్లాట్లు విక్రయాలు జరిపారు. ఇది చాలదని వైఎస్సార్ నగర్ సమీపంలోని నందమూరి నగర్‌లో కొందరి పేదల పట్టాలు తీసుకుని పేర్లు మార్చిడి చేసి పంచుకున్నారు. ఈ క్రమంలో మెయిన్ రోడ్డుపై రూ. లక్షల విలువ చేసే 12 సెంట్ల స్థలంలో సేవాదళం పేరుతో రెండస్తుల పెద్ద భవనాన్ని నిర్మించారు. అందులో పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్, అల్లికలు నేర్పుతామని చెప్పి స్థానికులను నమ్మించారు. కొన్నాళ్ల తర్వాత ఆ భవనాన్ని ఇతరులకు అద్దెకు ఇచ్చుకుని టీడీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ భవనానికి దాదాపుగా రూ. 30 వేల వరకు అద్దె సదరు టీడీపీ నేతకు అందుతోంది. ఓ ప్రైవేటు స్వచ్ఛంధ సంస్థకు ఆ భవనం అద్దెకు ఇచ్చి వారి నుంచి ప్రతి నెల అద్దె వసూలు చేస్తున్నారు. పేదలు ప్రశ్నించకుండా తూతూ..మంత్రంగా మినరల్ వాటర్ ఉచితంగా ఇస్తున్నారు. టీడీపీ నేతలు ఆక్రమించిన ఆస్థలం విలువ ఇప్పుడు దాదాపుగా రూ. 1 కోటి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గతంలో స్థల ఆక్రమణను ప్రశ్నించిన ఓ సామున్యుడిపై టీడీపీ నేతలు ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించి జైలుకు పంపారు. దీంతో అక్కడి పేదలు టీడీపీ నేతల అక్రమాలకు అడ్డు చెప్పలేక మిన్నకుండి పోయారు.

పూజారి స్థలాన్నీ వదల్లేదు..

పట్టణంలోని గోపాల్‌నగర్ వీధికి చెందిన బాలాంజనేయ కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండ్ వెనుక సర్వే నెంబర్ 398లో 50 సెంట్ల స్థలంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. బాలాంజనేయ మృతిచెందిన తర్వాత ఆయన పెద్దకుమారుడు సంగీత కుమారస్వామికి డబ్బు అవసరం కాగా ఆశ్రమం స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. ఇదే క్రమంలో 2022లో పట్టణానికి చెందిన టీడీపీ నేత సమీప బంధువు ఆ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు 40 సెంట్లకు రూ. 12.50 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించి 8 నెలల గడువులోగా మిగతా నగదు చెల్లించి రిజిస్టర్ చేసుకుంటానని నమ్మించాడు. గడువు ముగిసిన తర్వాత స్థలం కొనుగోలు చేయకపోవటంతో పెద్దల సమక్ష్యంలో పంచాయితీ చేసి 20 సెంట్లు రూ. 60 లక్షలకు కొనుగోలు చేసినట్లు నగదు చెల్లించకుండానే పూజారితో సంతకం చేయించుకున్నారు. ఇదేంటని ప్రశ్నించిన పూజారిని టీడీపీ నేత బుకాయించి పత్రాలు తీసుకుని వెళ్లిపోయారు. దీంతో పూజారి గుడికి తాళం వేసుకుని నిరసన వ్యక్తం చేయడంతో ఆలయం పెద్దలు, పోలీసులు అక్కడికి చేరుకుని పూజారికి న్యాయం చేస్తానని చెప్పడంతో నిరసనను విరమించుకున్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని ఎస్పీ రఘువీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా టీడీపీ నేతలను కోరారు. అయితే తాము స్టేషన్‌కు రామని కోర్టుకు వెళతామని చెప్పి బుకాయించడంతో పూజారి లబోదిబోమంటూ కన్నీరు పెట్టుకున్నాడు. న్యాయం చేయాలని కోరుతున్నాడు.

తప్పుడు కేసులు బనాయించారు



గత ప్రభుత్వంలో వైఎస్సార్ నగర్‌లో పేదల పట్టాలు ఆక్రమించి ఇష్టమొచ్చినట్లుగా టీడీపీ నాయకులు విక్రయాలు జరిపారు. దీంతో పట్టాలు కోల్పోయిన వారికి మద్దతుగా నా కుమారుడు శివ టీడీపీ నేతలను నిలదీశాడు. ఈక్రమంలో పేదలపై దాడి చేయటమే కాకుండా ఎస్సీ, ఎస్టీ కేసు బనాయించారు. అన్యాయంగా తప్పుడు కేసు బనాయిస్తుంటే పేద ప్రజలు భయపడి టీడీపీ నేతలకు అడ్డుచెప్పలేదు.

– పీవి రమణ, వైఎస్సార్ నగర్

నా స్థలాన్ని ఆక్రమించారు



పట్టణానికి చెందిన టీడీపీ నేత ముఖ్యఅనుచరుడు నా స్థలాన్ని ఆక్రమించాడు. నకిలీ అగ్రిమెంట్ తయారు చేసి 40 సెంట్ల స్థలాన్ని కాజేయాలని చూస్తున్నాడు. స్థలం వైపు వెళితే మాపైనే బెదిరింపులకు దిగుతున్నాడు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన వాళ్లు లెక్కచేయటం లేదు. కోర్టుకు వెళ్లి స్థలాన్ని సొంతం చేసుకుంటామని బెదిరిస్తున్నారు. అధికారులు విచారించి న్యాయం చేయాలి.

– సంగీతకుమార స్వామి, నంద్యాల

అనుమానంతో భార్యను నరికేసిన భర్త

● అడ్డు వచ్చిన భార్య పిన్నిపైనా కత్తితో దాడి



భార్యను విచక్షణా రహితంగా నరుకుతున్న భర్త

అవుకు: అనుమానంతో భార్యను అతి కిరాతకంగా నరికిన ఘటన మండల కేంద్రం అవుకులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అడ్డొచ్చిన భార్య పిన్నిపైనా కత్తితో దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన మేరకు.. అవుకు పట్టణానికి చెందిన ఓబుళాపురం రంగస్వామి మొదటి భార్యతో విడిపోవటంతో 15 ఏళ్ల క్రితం ఓబుళంపల్లెకు చెందిన కుమారి(37)ని రెండో వివాహం చేసుకున్నాడు. రంగస్వామి ఇంట్లో ఉన్న డబ్బులన్నీ తీసుకెళ్లి నెలలు నెలలు ఇతర జిల్లాల్లో తిరుగుతుంటాడు. అప్పుడప్పుడు ఇంటికి వస్తూ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. గత మూడు సంవత్సరాలుగా వీరి మధ్య గొడవలు అధికమయ్యాయి. ఎప్పటిలానే రంగస్వామి ఇంట్లో ఉన్న డబ్బులన్నీ తీసుకెళ్లి ఏడు నెలలు తిరిగి 15 రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. భార్యాభర్తల మధ్య గొడవ చోటు చేసుకోవడంతో కుమారి పుట్టింటికి చేరుకుంది. తన బంధువులతో కలిసి సోమవారం అవుకుకు వచ్చి పెద్ద మనుషుల వద్ద గాని, పోలీస్ స్టేషన్ వద్దగాని పంచాయితీ పెట్టాలని అనుకున్నారు. అయితే ఎస్ఐ సెలవుల్లో ఉండటం, పెద్ద మనుషులు ఊర్లో లేకపోవటంతో కుమారి ఆమె పిన్ని పొదుపు పనుల నిమిత్తం అవుకులోనే ఉండగా.. మిగతా వారు ఊరికి బయల్దేరారు. ఇదే సమయంలో భార్య బస్టాండ్ వద్ద ఉన్న విషయం తెలుసుకున్న రంగస్వామి తనవెంట తెచ్చుకున్న కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో దాడికి తెగబడ్డాడు. తప్పించుకునేందుకు ఆమె కొద్దిదూరం వెళ్లినా వదలకుండా విచక్షణారహితంగా నరికేశాడు. అడ్డు వచ్చిన కుమారి చిన్నమ్మ గంగమ్మపైనా కత్తితో దాడి చేయడంతో తల, చేతులపై తీవ్ర రక్త గాయాలయ్యాయి. కుమారి తల, మెడ, మొహం మీద.. చేతులకు తీవ్ర కత్తిపోట్లు కావడంతో రక్తపు మడుగులో పడిపోయింది. బహిరంగ ప్రాంతంలో, చుట్టూ జనం ఉన్నా ఆడ్డుకునే సాహసం ఎవరూ చేయలేకపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కుమారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించగా కోలుకోలేక మరణించింది. ఈ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఓ కుమారుడు సంతానం. నిందితుడు దాడి చేసిన కత్తితో స్థానిక పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు.

కేసీలో పడిన బొలెరో వాహనం

● 20 మందికి తప్పిన ప్రాణాపాయం



కేసీలో పడిన బొలెరో వాహనం

జూపాడుబంగ్లా: బొలెరో వాహనం సోమవారం కేసీ కాలువలో పడింది. ఈ ప్రమాదంలో 20 మంది ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వివరాలు.. మూడు రోజుల క్రితం గుంతకల్లు నియోజకవర్గం వజ్రకరూర్ మండలం గుర్రంపాడు గ్రామానికి చెందిన భక్తులు బొలెరో వాహనంలో శ్రీశైలానికి వెళ్లారు. స్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో జూపాడుబంగ్లా వద్ద కేసీ కాలువలో స్నానం చేసేందుకు వాహనాన్ని నిలిపారు. అయితే డ్రైవర్ వాహనాన్ని డౌనల్లో ఉంచి హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో ఒక్కసారిగా కేసీలోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. వాహనంలో 20 మంది ఉన్నారు. పాదయాత్రతో శ్రీశైలానికి వెళ్తున్న శివస్వాములు ప్రమాద ఘటనను చూసి కేసీ నీటిలో అల్లాడుతున్నా వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఎవరికీ ఎలాంటి ప్రాణహాని కలగకపోవడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.

పేదలకు 'పీఎం సూర్యఘర్'

● పోస్టల్ సూపరింటెండెంట్ విజయజ్యోతి



కర్నూలు (న్యూటౌన్): పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకాన్ని అమలు చేస్తోందని పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ విజయజ్యోతి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఉద్యోగులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ పథకం కింద పేదలు ఇంటిపైన సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుంటే రూ.78వేల వరకు రాయితీ లభిస్తుందన్నారు. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చన్నారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీసులను సంప్రదించవచ్చని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఫజుల్ రహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో నిందితుడికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్న నిందితుడికి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. వివరాల మేరకు పట్టణంలోని చాంద్‌బాడ వీధికి చెందిన షేక్‌మహబూబ్ స్థానిక ఫాతిమా హైస్కూల్ వద్ద మద్యం సేవించి దారిన పోయే మహిళ పట్ల అసభ్యకరంగా పాటలు పాడుతూ, ఈలలు వేస్తూ ఇబ్బంది కలిగించాడు. స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లిపెద్ద బ్రహ్మనందీశ్వరుడికి ఆహ్వానం



నంద్యాలకు ఉత్సవంగా బయల్దేరిన మహానందీశ్వర దంపతులు

నంద్యాల(వ్యవసాయం)/మహానంది: మహానంది బ్రహ్మోత్సవాల సందర్భంగా పెళ్లిపెద్దగా వ్యవహరించేందుకు బ్రహ్మనందీశ్వరస్వామిని ఆహ్వానించేందుకు శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి సోమవారం సాయంత్రం నంద్యాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక చెరువు కట్ట వద్ద ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ కోలా నాగభూషణం వేదపండితులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీగణపతి దేవాలయం విడిదిలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మహానంది దేవస్థానం ఆలయ ప్రధాన అర్చకుడు రవిశంకర అవధాని మాట్లాడుతూ శివరాత్రి దుగ రోజున శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరుడిని కల్యాణానికి పెళ్లి పెద్దగా వ్యవహరిస్తూ ఆహ్వానం గత కొన్ని దశాబ్దాలుగా ఈ సందాయం కొనసాగుతుందన్నారు. మంగళవారం పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించి బ్రహ్మనందీశ్వరస్వామి, కామేశ్వరిదేవిలను తమవెంట మహానందికి తీసుకొని వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్లు ఓంకారం కృష్ణుడు, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట అమ్మేందుకు వెళ్లి మృత్యు ఒడికి

● బొలెరో వాహనం టైరు పగిలి రైతు మృతి



మృతిచెందిన రైతు నాగేంద్ర (ఫైల్)

పెద్దకడబూరు: మిరప పంటను అమ్ముకోవడానికి వెళ్లి ఓ రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి కర్ణాటక రాష్ట్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కంబలదిన్నె గ్రామానికి రైతులు కర్ణాటక రాష్ట్రం బ్యాడిగిలో మిరప పంటను అమ్ముకోవడాని కి ఆదివారం సాయంత్రం గ్రామం నుంచి బొలెరో వాహనంలో బయలుదేరారు. బళ్లారి దాటి హైవేపై ప్రయాణిస్తున్న సమయంలో ఆదివారం రాత్రి వాహనం టైరు పగిలి పోయింది. దీంతో ఒక్కసారి గా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న రైతు నాగేంద్ర(37)కు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన రైతులు వసంతరాజు, తిమ్మరాజు, గోవిందు, లింగప్పకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నాగేంద్రను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించేలోపు మృతి చెందాడు. మృతుడికి భార్య జయలక్ష్మి , కుమార్తె ధరణి ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి సోమవారం కంబలదిన్నె గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యలను పరామర్శించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



స్పందనలో ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి హైదరాబాద్ ఐటీసీ ఇన్‌ఫోటెక్ పేరుతో ఫేక్ కాల్ లెటర్ (నకిలీ) ఇచ్చి రూ.2.85 లక్షలు తీసుకుని కర్నూలుకు చెందిన సాయికిరణ్ మోసం చేశాడని, తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు ముజఫర్ నగర్‌కు చెందిన సంతోష్ కుమార్ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశాడు. కర్నూలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 77 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- టెలిగ్రామ్ యాప్‌లో కమిషన్ బేసిస్‌లో డబ్బులు ఇస్తామని ఆశ చూపించి జొమాటో పేరుతో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఉన్నాయని ఆన్‌లైన్ లింకులు పంపి వేర్వేరుగా పది బ్యాంకు ఖాతాల్లో రూ.7 లక్షలు వేయించుకుని మోసం చేశారని, ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలంటే ఇంకా 50 శాతం డిపాజిట్ చేయాలని చెబుతూ మోసం చేస్తున్నారని, విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా కర్నూలుకు చెందిన షాషావలి ఫిర్యాదు చేశారు.
- తాను ఫేస్‌బుక్ చూస్తుంటే రవికుమార్ అనే పేరుతో ఉన్న ఫేస్‌బుక్ ఖాతా నుంచి మిలాన్ డే గురించి లింక్ పంపించాడని, ఆ లింక్‌ను క్లిక్ చేయగా తనకు వాట్సాప్‌లో హాయ్ అని చెప్పి.. లక్కీడ్రా వస్తుందని రూ.2 వేలు వేయించుకున్నాడని, తర్వాత రూ.2.5 లక్షలు లక్కీడ్రాలో వచ్చాయని చెప్పి 10 శాతం కమిషన్ కింద రూ.20 వేలు కట్టించుకుని మోసం చేసినట్లు రామళ్లకోట గ్రామానికి చెందిన ఖలీల్ బాషా ఫిర్యాదు చేశాడు.
- కొత్త బ్యాంకు ఖాతా అయినందున యూపీఐడీ పనిచేయడం లేదని, సర్వర్ బిజీ ఉందని, సర్వీస్ చార్జిలని, వివిధ కారణాలు చెప్పి నజీర్ అనే పేరు గల ఫోన్‌పేకు మొత్తం రూ.70 వేలు వేయించుకుని తెలియని వ్యక్తులు మోసం చేశారని ఖలీల్ బాషా రాతపూర్వకంగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- సీడ్ పత్తి విత్తనాలు, దూది పత్తి విత్తనాలు కలిపి 15 క్వింటాళ్లు తన నుంచి కొనుగోలు చేసి వారం రోజుల్లో డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మహబూబ్‌నగర్ జిల్లా ఐజ మండలానికి చెందిన శివశెట్టి, ఏజెంట్ జూలమంచి ఈడిగ నారాయణ మోసం చేశారని కోసిగి మండలం దొడ్డిబెళగల్‌కు చెందిన రైతులు బి.నాగేంద్ర, హనుమంతు, తిక్క స్వామి, చంద్రన్నలు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 18 నుంచి ఉదయం 30వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు హాల్‌టికెట్లను www. bsc.ap.gov. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల లాగిన్ యూజర్ పేరు, స్కూల్ కోడ్, పాస్వర్డ్‌తో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వ్యక్తిగత హాల్‌టికెట్లను జిల్లా పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ఫీల్డ్‌లను ఎంచుకుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ తెలిపారు.

ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్-10 రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.16,500, మధ్యస్థ ధర రూ.14,600, కనిష్ఠ ధర రూ.13,000 గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.8,500, మధ్యస్థ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.5,500గా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

● జేసీ నారపురెడ్డి మౌర్య



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..నిర్దేశించిన సమయంలోపు స్పందన అర్జీలను పరిష్కరించాలన్నారు. బాధితులతో మాట్లాడి క్షేత్ర స్థాయి పరిస్థితులను అర్థం చేసుకొని పరిష్కారాలు చూ పాలన్నారు. స్పందన అర్జీలు రీఓపెన్ అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్ రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ కలెక్టరు నాగప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన కొన్ని అర్జీలు...

- కోడుమూరు పట్టణం నుంచి పొలాలకు వెళ్లే రహదారిని కొందరు నాగులకట్ట దగ్గర ఆక్రమిస్తుండడంతో బండ్లు, ట్రాక్టర్లు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని, చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు సురేష్, లింగన్న హరీష్, రాజు, వీరేష్, సుధాకర్ కోరారు.
- తాను రెండు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, ఈ భూమి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఓర్వకల్లుకు చెందిన సావిత్రమ్మ, తిరుపాలు విన్నవించారు.
- దిన్నేదేవరపాడు పరిధిలోని 59.90 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమికి రక్షణ కల్పించాలని ఎస్‌డీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం ఇచ్చారు.